


పండగ శోభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ పండగ శోభతో విజయనగరంలో సందడి వాతా వరణం నెలకొంది. శనివారం అమ్మవారి ఆలయానికి యాత్రికులు ఘటాలతో చేరుకుని, దర్శనాలు చేసుకొన్నారు. నగరంలోని పైడితల్లమ్మ ఆలయంతోపాటు కోట, ఇతర ప్రాంతాల్లో విద్యుత్తు అలంకరణలను మరింత శోభని తీసుకొచ్చాయి.



ఆలయానికి ఘటాలను తీసుకొస్తున్న మహిళలు

దేశమంటే మట్టి కాదోయ్

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అన్నాడు మహాకవి గురజాడ. కానీ, దేశమంటే మనుషులు కాదోయ్, దేశమంటే మట్టోయ్.. అంటోంది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం. నాదేశం – నామట్టి అంటూ జిల్లాల చేపట్టిన కార్యక్రమం ఇందుకు తార్కాణం. మట్టికి ప్రణామాలు.. వీరులకు వందనాలు.. అనే నినాదంతో కేంద్రం తలపెట్టిన 'నా మట్టి – నా దేశం' కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రెండు రోజుల క్రితం ప్రారంభించారు. ఇందులో భాగంగా బయలుదేరిన బస్సులో 33 మండలాలకు చెందిన యువకులు మట్టి కలశాలను ఢిల్లీకి తీసుకెళ్లడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమాన్ని, సందర్భాన్ని చూసిన జిల్లా వాసులు నివ్వెరబోతున్నారు. దేశం ఎటుపోతోందో? అంటూ కొందరు, పాలకులు ఎటువైపు తీసుకెళ్తున్నారో.. అంటూ మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. మహాకవి గురజాడ చెప్పినట్టు దేశం అంటే మట్టికాదు.. దేశమంటే ముమ్మాటికీ మనుషులే. ఇది ఎంతో దూరదృష్టితో చెప్పిన మాట. దేశమంటే మట్టి అనుకుంటే మానవాళికి ఉన్న విలువ, మనుగడ ప్రశ్నార్థకమౌతుంది. కాబట్టి ఆ మానవాళి మనుగడ కోసం మట్టిని ఉపయోగించాలి తప్ప, మట్టినే దేశం అనుకుంటే సమాజ గమనానికి, పురోగతికి ముప్పువాటిల్లినట్టే. కానీ, నాదేశం – నామట్టి అనే కార్యక్రమం ద్వారా దేశమంటే మట్టి అనే భావన



కలిగే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చెప్పకనే చెబుతోంది. వాస్తవానికి వివిధ ప్రాంతాల మట్టికలిపితే దేశం సుభిక్షంగా, సురక్షితంగా ఉంటుందనుకుంటే ఈపాటికే మన రాష్ట్రానికి గానీ, మన జిల్లాకు గానీ ఎంతో మేలు జరగాలి. రాష్ట్ర రాజధాని నిర్మాణ సమస్య ఉండేదే కాదు. అమరావతి నిర్మాణంలో భాగంగా అప్పట్లో ప్రధాని మోడీ పట్టెడు మట్టి, దోసెడ గంగ తీసుకుని వచ్చారు. ఆ తరువాత రాజధాని నిర్మాణం ఏమైనా దూసుకుపోయిందా?. అమరావతి మొత్తం ఊహా చిత్రాలకు పరిమితమైంది. వాస్తవానికి నాడు ప్రధాని తెచ్చిన మట్టి, నీరుకు బదులు కాస్త ఆర్థిక సాయం చేసి ఉంటే ఈపాటికి మూడు రాజధానులనే సమస్యే ఉండేది కాదు. ఈ మాటకొస్తే మట్టి కలశాల సంగమం ఏమైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలు తగ్గిస్తుందా? లేక విద్యుత్తు సంస్కరణల నుంచి ప్రభుత్వం వెనక్కి వెళ్లే విధంగా ప్రభావితం చేస్తుందా? అని జనం చర్చించుకుంటున్నారు. వెనుకబడిన విజయనగరం జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదు. ఉత్తరాంధ్రకు తలమానికంగా ఉన్న విశాఖ రైల్వేజోన్‌కు ఊసే లేదు. విభజన జరిగిన తొమ్మిదేళ్ల పూర్తయినా గిరిజన యూనివర్సిటీ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదు. పెరిగిన ధరలు, కేంద్ర హామీలు, కార్మిక, కర్షక, ఉద్యోగ, మహిళా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా చర్చ నడుస్తున్న నేపథ్యంలో 'సెంటిమెంట్'తో జనాన్ని పక్కదారి పట్టించేందుకు నాదేశం – నామట్టి అనే కార్యక్రమాన్ని కేంద్రం తీసుకొచ్చిందని పబ్లిక్‌టాక్.


డ్వాక్రా బజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

డ్వాక్రా ఉత్పత్తులను ఆదరించాలి

అఖిల భారత డ్వాక్రా బజార్‌ను ప్రారంభించిన మంత్రి బొత్స

ప్రజాశక్తి–విజయనగరంకోట

డ్వాక్రా మహిళల ఉత్పత్తులను ఆదరించి ప్రోత్సహించాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. నగరంలోని దిగువ ట్యాంక్‌బండ్ రోడ్డులో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్ ను మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 250కి పైగా స్టాల్స్ ఇక్కడ ఏర్పాటవుతున్నాయని చెప్పారు. మహిళలకు అవసరమైన వస్త్రాలు, హస్తకళాకృతులు, తినుబండారాలు, గృహాలంకరణ వస్తువులు సహా ఎన్నో రకాల వస్తువులు ఇక్కడ లభ్యమవుతాయని, నగర, జిల్లా ప్రజలు దీనిని వినియోగించుకోవాలని కోరారు. ఇప్పటికే 150 స్టాల్స్ ఏర్పాటయ్యాయని, మిగిలినవి కూడా ఆదివారం ఉదయానికి ఏర్పాటవుతున్నట్టు చెప్పారు.

డిసిసిబి, ఆప్కాబ్ స్టాల్స్‌ను ప్రారంభించడంతో పాటు అన్ని స్టాళ్లను సందర్శించి ఆయా మహిళలతో మంత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, నగర మేయర్ వి.విజయలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'జగనన్నకు చెబుదాం' రద్దు

విజయనగరం : కలెక్టరేట్‌లో నిర్వహించు జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా ఈ సోమవారం రద్దు చేసినట్లు డిఆర్ఒ ఎస్.డి.అనిత ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు గమనించాలని కోరారు.

1న రాష్ట్ర అవతరణ వేడుకలు

విజయనగరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నవంబర్ ఒకటో తేదిన కలెక్టరేట్ ఆడిటోరియంలో వేడుకలు నిర్వహించనున్నట్లు డిఆర్ఒ ఎస్.డి అనిత ఒక ప్రకటనలో తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించడం, జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్నట్లు తెలిపారు.

4న జిల్లా వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

నెల్లిమర్ల : నవంబర్ 4న జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలను కొండవెలగాడలో నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి చల్ల రాము ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాలురు, బాలికల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఎంపిక పోటీలకు వచ్చే వారు ఆధార్ కార్డు, ఇండియన్ ఫెడరేషన్ ఇచ్చిన ఐడి కార్డు తేవాలని, వివరాలకు ఫోన్ నంబర్ 94909 49759ను సంప్రదించాలని కోరారు.

వాల్మీకికి ఘన నివాళి

విజయనగరం : మహర్షి వాల్మీకి జయంతిని శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ అనిత మాట్లాడుతూ రామాయణం వంటి మహాగ్రంథాన్ని మనకు అందించిన వాల్మీకి మహర్షి చిరస్మరణీయులని కొనియాడారు. రామాయణం మన జీవన విధానానికి ఒక మార్గమన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమాధికారి యశోదనరావు, బోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పువ్వల వెంకటరావు, రెడ్డిక సంక్షేమ సంఘం డైరెక్టర్ భాస్కరరెడ్డి, ఎబిసిడబ్ల్యూఒలు శ్యామలకుమారి, రాజులమ్మ పాల్గొన్నారు.


వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

జిల్లా పోలీసు కార్యాలయంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి ఎఎస్‌పి అస్మా ఫర్హీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ఆర్ఐలు ఎన్.గోపాల నాయుడు, రమణమూర్తి, డిసిఆర్‌బి ఎస్ఐ వాసుదేవ్, ఆర్ఎస్ఐలు శ్రీనివాసరావు, రామకృష్ణ, ప్రసాద్, నీలిమ, నారాయణరావు, కేశవరావు, రాంబాబు పాల్గొన్నారు.

గ్రామీణ కిరాణా మొబైల్ స్టాల్ ప్రారంభం


మొబైల్ స్టాల్‌ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ భావన

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

సేంద్రీయ ఉత్పత్తులను విక్రయించే గ్రామీణ కిరాణా మొబైల్ వాహనాన్ని డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగర ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా డిసిఎంఎస్ తరపున వినూత్న కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రైతులు సేంద్రీయ పద్ధతిలో పండించిన పంటలకు మార్కెటింగ్ కల్పించాలన్న సదుద్దేశంతో కొర్రలు, సామలు, అరికలు, ఊదలు, రాగులు, అండుకొర్రలు, జనుగులు, పెసలు, కందులు, మినుములు, బొబ్బర్లు, సోయా, బ్లాక్ రైస్, బెల్లం, చింతపండు మార్కెటింగ్ చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు,, వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్, డిపిఎం ఆనందరావు, డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ బి.వి.ఎస్ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రామానాయుడు రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

నగరంలోని వాణిజ్య రహదారైన రామానాయుడు రోడ్డును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శనివారం ప్రారంభించారు. కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన బిటి రోడ్డును ఆయన ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. రహదారి ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటి ప్రకాశ్ మాట్లాడుతూ ఎంతోకాలంగా వాణిజ్య కేంద్రంగా ఉండే రామానాయుడు రోడ్డు గతుకులతో ఉండేదన్నారు. పరిస్థితిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టికి తీసుకెళ్ళిన వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, వైసిపి నాయకులు యడ్ల రాజేష్, వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షులు కె.లక్ష్మణమూర్తి, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యం కలగొద్దు

ప్రముఖుల దర్శనాలు సోమవారమే పూర్తిచేసేందుకు చర్యలు : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి–విజయనగరంటౌన్

పైడితల్లమ్మ పండగకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ముఖ్యంగా ఇతర, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు అసౌకర్యం లేకుండా చూసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. ఈ ఉద్దేశంతోనే ప్రముఖులను సోమవారమే దర్శనాలు పూర్తిచేసుకోవాలని కోరుతున్నట్టు చెప్పారు. తాను కూడా సోమవారమే దర్శనం చేసుకుంటానన్నారు. పైడితల్లమ్మ పండగ నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శనివారం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రెవెన్యూ, దేవాదాయ, పోలీసు అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. సాధారణ భక్తుల దర్శనాలకు వీలుగా మంగళవారం ప్రముఖుల తాకిడి లేకుండా చూసేందుకే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆలయంలోకి క్యూలైన్ల ద్వారా ప్రవేశం, దర్శనానంతరం తిరిగి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ప్రముఖులు ఆలయంలోకి ప్రవేశించే ద్వారం వద్ద ఏర్పాట్లు, ఈ మార్గంలో ప్రవేశాలు నియంత్రించేందుకు చేస్తున్న ఏర్పాట్లపై ఆలయ అధికారులకు సూచనలు చేశారు. ఈ పర్యటనలో పైడితల్లమ్మ ఆలయ ఇఒ సుధారాణి, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, డిఎస్‌పి గోవిందరావు, ట్రాఫిక్ డిఎస్‌పి విశ్వనాథ్, తహశీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


పైడితల్లమ్మ ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

3 గంటలకే సిరిమాను ప్రారంభం కావాలి

ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ

విజయనగరం : పైడితల్లమ్మ సిరిమాను రథం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకే ప్రారంభించేలా చూడాలని ఆర్‌డిఒ సూర్యకళ తెలిపారు. గతేడాది ఆలస్యమైందని, ఈ ఏడాది సమయపాలన పాటించాలని, అందుకోసం ముందుగానే అవసరమగు సామగ్రిని, కార్యకర్తలను సిద్ధం చేయాలని సూచించారు. శనివారం ఆర్‌డిఒ కార్యాలయంలో అమ్మవారి ఉత్సవాల నిర్వహణ, సిరిమాను, ఇతర రథాల నిర్వహణపై అధికారులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ రథాలన్నీ 11 గంటలకే ప్రారంభం కావాలన్నారు. దారి పొడుగునా జనం పూజలు, మొక్కులు తీర్చుకుంటారని, వారి ఆనవాయితీలను పాటిస్తూనే సమయానికి కదిలేలా చూడాలని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటలకే అమ్మవారి గుడి వద్ద సిద్ధంగా ఉన్న రథాలన్నీ చేరుకోవాలన్నారు. ఒక్కో కార్యక్రమానికి, ఒక్కో రథానికి తహశీల్దార్లను, పోలీస్, దేవాలయ సిబ్బందిని ఇన్‌ఛార్జిగా నియమించారు. ప్రతి రథం వద్ద ముందస్తుగా అనుమతించిన వారు తప్ప ఇతరులకు చోటు ఉండకూడదన్నారు. టి–షర్టులు, ఐడి కార్డులు వేదిక వారీగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో పైడితల్లమ్మ దేవాలయ ఇఒ సుధారాణి, పూజారి బంటుపల్లి వెంకటరావు, పోలీస్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి పటిష్ట బందోబస్తు


మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

విజయనగరం : ఈ నెల 29, 30, 31 తేదీల్లో జరిగే విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ తొలేళ్ళు, సిరిమానోత్సవానికి పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లుగా ఎస్‌పి దీపిక తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సిరిమానోత్సవాన్ని శాంతి యుతంగా నిర్వహించేందుకు బందోబస్తును సెక్టార్లుగా విభజించామన్నారు. 2015 మంది పోలీసులు మూడు షిఫ్టులుగా విధులు నిర్వహిస్తారని తెలిపారు. బందోబస్తులో ఇద్దరు అదనపు ఎస్‌పిలు, 12 మంది డిఎస్‌పిలు, 58 మంది సిఐలు/ఆర్ఐలు, 144 మంది ఎస్ఐలు/ఆర్ఎస్ఐలు, 19 మంది మహిళా ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, స్పెషల్ పార్టీ సిబ్బందితో సహా 2015 మంది ఉంటారని వివరించారు. మొత్తం బందోబస్తును, కమాండ్ కంట్రోల్ పర్యవేక్షించేందుకు పోలీసు అధికారులను నియమించామన్నారు. ఈ బందోబస్తు విధుల్లో ఎన్‌సిసి సిబ్బంది సేవలను కూడా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఆలయం ఎదురుగా తాత్కాలికంగా కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిరిమాను తిరిగే ప్రాంతాలను, సిరిమాను తీసుకొని వచ్చే మార్గంలో, ఇతర ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సిరిమాను తిరిగే మార్గంలో ముందుగా గుర్తించిన 11 ప్రాంతాల్లో రూఫ్ టాప్‌లలో పోలీసులను నియమించి, నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిరిమాను తిరిగే ప్రాంతాలకు దగ్గరలో శిథిలావస్థలో ఉన్న 11 భవనాలను గుర్తించి, ఆయా భవనాల మీదకు ఎవరినీ అనుమతించవద్దని యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. వాహనాల పార్కింగుకు ఎక్కడికక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పి వెల్లడించారు. సమావేశంలో ఎఎస్‌పి అస్మా ఫర్హీన్, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, డి.విశ్వనాథ్, సిఐలు నర్సింహమూర్తి, వెంకటరావు, జె.మురళి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి–విజయనగరంటౌన్

విజయనగరం ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో భాగంగా శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ జంక్షన్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, కోట, మూడు లాంతర్లు, గంటస్థంభం మీదుగా రాజీవ్ క్రీడా మైదానం వరకు ఈ ర్యాలీ జరిగింది. ర్యాలీని కలెక్టరేట్ వద్ద సెట్విజ్ సిఇఒ రామ్‌గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పదిమందికి ప్రోత్సాహక బహుమతులు కూడా అందిస్తామన్నారు. వీటిలో ఐదు ప్రోత్సాహక బహుమతులను బాలికలకు కేటాయించామని తెలిపారు. ఈ పోటీలో బాలబాలికలు, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పైడితల్లమ్మ పండగకు పక్కా ఏర్పాట్లు

ఈ నెల 30, 31 తేదిల్లో పైడితల్లమ్మ పండగ నేపథ్యంలో వచ్చే యాత్రికులకు, నగర ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు తెలిపారు. పండగకు వచ్చే యాత్రికులకు ఆహ్లాదకరంగా నగరం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. లక్షల సంఖ్యలో యాత్రికులు తరలిరానుండటంతో అందుకు తగ్గట్టు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పైడితల్లమ్మ పండగ నేపథ్యంలో ఆయన 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పండగకు ఏర్పాట్లు, తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరంటౌన్



- పైడితల్లమ్మ పండగకు పక్కా ఏర్పాట్లు
- యాత్రికులకు ఇబ్బంది లేకుండా చర్యలు
- మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేకంగా..
- 'ప్రజాశక్తి'తో కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు ముఖాముఖి

లక్షల సంఖ్యలో వచ్చే యాత్రికులకు ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.?

పైడితల్లమ్మ పండగకు లక్షల సంఖ్యలో యాత్రికుల తాకిడి ఉంటుంది. నగరంలో ఉన్న మరుగుదొడ్లతోపాటు 13 ప్రాంతాల్లో తాత్కాలిక మరుగుదొడ్లు, యూరినల్స్ ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రధాన కూడళ్లతోపాటు ఆలయం వెనుక, కార్పొరేషన్ కార్యాలయం ఎదుట, గుమ్చి, అంబటిసత్రం, ఆర్‌టిసి కాంప్లెక్సు, టిటిడి కళ్యాణ మండపం, రైల్వేస్టేషన్ వద్ద వీటిని ఏర్పాటు చేస్తాం.

తాగునీటి సరఫరాకు తీసుకుంటున్న చర్యలేమిటి.?

పండగ రెండు రోజులు నీటి సరఫరా చేస్తున్నాం. కుళాయిలు లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం. ప్రధాన ప్రాంతాల్లో నగర పాలకసంస్థ కాంట్రాక్టర్ల ద్వారా చలివేంద్రాలు ఏర్పాటు చేయిస్తున్నాం. పండగకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

సిరిమాను వచ్చే పుచ్చలవీధి, గంటస్తంభం రోడ్డు పాడై, గోతులమయమైంది. పండగ నేపథ్యంలో ప్యాచ్ వర్కులు చేపట్టారా.?

నగరంలో పలు రోడ్లకు ప్యాచ్ వర్కులు పూర్తి చేసేందుకు రూ.10 లక్షలు ఖర్చుచేశాం. ప్రధాన రహదారుల్లో ఎటువంటి గతకలు లేకుండా ప్యాచ్ వర్కులు పూర్తి చేశాం. మరో మూడు కోట్ల రూపాయలు వరకు కేటాయించి, బాలాజి జంక్షన్ నుంచి గంటస్తంభం వరకు రోడ్డు వేశాం. పెద్దచెరువు గట్టును సుమారు రూ.కోటిన్నరతో సుందరంగా తయారు చేస్తున్నాం. ఇప్పటికే రూ.50 లక్షలతో పనులు చేయించాం. రెండో విడతలో మరో రూ.50 లక్షలతో టెండర్ పిలుస్తాం.

పారిశుధ్య నిర్వహణకు తీసుకుంటున్న చర్యలేమిటి.?

ప్రస్తుతమున్న 600 మంది కార్మికులతో యథావిధిగా పనులు చేయిస్తాం. అదనంగా రెండు రోజులకు గాను 225 మంది కార్మికులను తీసుకుంటున్నాం. ఇందుకోసం ఒక్కొక్కరికి రూ.550 చెల్లించనున్నాం. ప్రధానంగా వనంగుడి, చదురుగుడి వద్ద, ప్రధాన రహదారిపై వీరితో పనిచేయించనున్నాం. సిరిమాను తిరిగే సమయంలో అరటిపండ్లు వెనువెంటనే ఏరివేసి, రోడ్డును శుభ్రంగా ఉంచేందుకు 80 మంది కార్మికులతో పనిచేయించనున్నాం. వెంటనే పిచికారి చేసి, బ్లీచింగ్ చల్లిరోడ్డును శుభ్రంగా ఉంచుతాం. దీని కోసం ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యలో కార్మికులను, వాహనాలను సిద్ధంగా ఉంచుతున్నాం.

జంక్షన్లతోపాటు ప్రత్యేక ఆకర్షణ కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి.?

పండగ నేపథ్యంలో వచ్చే యాత్రికులకు ఆహ్లాదకరంగా కనిపించేలా సుందరీకరణ పనులు చేపట్టాం. నగరంలో చారిత్రక కట్టడాలు, జంక్షన్లను ప్రత్యేక విద్యుత్తు అలంకరణలతో ముస్తాబు చేస్తున్నాం. వ్యాపార సంస్థలకు ఒక్కొక్క కూడలి అప్పగించారు. వారే ఆ జంక్షన్‌కు ప్రత్యేక లైటింగ్ పెడతారు.

పండగ నేపథ్యంలో నగర ప్రజలకు, యాత్రికులకు ఇచ్చే సూచనలు ఏమిటి.?

యాత్రికులకు, నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నాం. నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన చెత్త బుట్టలో చెత్త వేసి సహకరించాలి. యాత్రికులకు పంపిణీ చేసే ప్రసాదాలు, వాటికి ఉపయోగించే పేపర్ ప్లేట్లు చెత్త బుట్టలో వేయాలి. తాగునీటిని వృథా చేయొద్దు. ఏ వార్డుల్లోనైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి అందరూ సహకరించాలి.



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాటం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

ప్రజాశక్తి–కొత్తవలస

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు. కొత్తవలసలో భవన నిర్మాణ కార్మికుల సంఘం రెండో మహాసభ జి.అప్పారావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ మహాసభలో తమ్మినేని, సురేష్‌తోపాటు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ మాట్లాడారు. పెండింగ్లో ఉన్న క్లయిములను వెంటనే పరిష్కరించాలన్నారు. సంక్షేమ బోర్డు నిధులు ప్రభుత్వం పక్కదోవ పట్టించకుండా కార్మికుల కోసం ఖర్చు చేయాలని డిమాండ్‌చేశారు. సంక్షేమ బోర్డును పాత పద్ధతిలో పునరుద్ధరణ చేసి సమర్థవంతంగా నడపాలన్నారు. 60 ఏళ్లు దాటిన కార్మికులకు ప్రభుత్వం పింఛను ఇవ్వాలని కోరారు. అందరినీ ఆదుకున్నామని చెప్తున్న ప్రభుత్వానికి భవన నిర్మాణ కార్మికులు కనపడలేదా? అని ప్రశ్నించారు. సెస్ ద్వారా వసూలవుతున్న డబ్బులను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రామునాయుడు, కార్యదర్శిగా నాగ రాజు, కోశాధికారిగా సత్యనారాయణ ఎన్నికయ్యారు.

ప్రయాణికుడికి లగేజీ బ్యాగు అందజేత

ప్రజాశక్తి–విజయనగరం కోట

మరిచిపోయిన లగేజీ బ్యాగును తిరిగి ఆర్‌టిసి అధికారులు ప్రయాణికుడికి అందజేశారు. రవివర్మ అనే వ్యక్తి శనివారం విశాఖపట్నం నుంచి విజయనగరం ఆర్‌టిసి బస్సులో వచ్చారు. బస్సులో తన లగేజీ బ్యాగును మరిచిపోయారు. బస్ టికెట్ ఆధారంగా బస్సు, ప్రయాణికుడి వివరాలు తెలుసుకుని బాధితుడికి లగేజీ బ్యాగు అందజేశారు. దీంతో రవివర్మ ఆర్‌టిసి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ కె.సత్యనారాయణ, ఎస్‌టిఐ రామారావు, అశోక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రజా రక్షణ భేరిని విజయవంతం చేయండి

శృంగవరపుకోట: నవంబర్ 15న విజయవాడలో నిర్వహించనున్న సిపిఎం భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ పిలుపునిచ్చారు. సిఐటియు యూనియన్ అనుబంధ సంఘాల ముఖ్యులతో సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాలు, వెంకట్రావు, గంగరాజు, విమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

భోగాపురం: యుటిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద జరిగింది. మండల గౌరవ అధ్యక్షులుగా పి. ప్రకాశరావు, అధ్యక్షులుగా పి. చంద్రశేఖర్, కార్యదర్శిగా ఆళ్ల వైకుంఠరావు, కోశాధికారిగా శ్రీనివాస బెహరా, మహిళా కార్యదర్శిగా జీ.వి. రత్నకుమారినిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జె. ఈశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా కె. ప్రసాదరావు, పరిశీలకులుగా కె. సూర్యారావు వ్యవహరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీపిఎస్ విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. తనిఖీలు పేరుతో ఉపాధ్యాయులను వేధించడం తగదన్నారు. వేధింపులు ఆపకపోతే మరోసారి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

బొబ్బిలి: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. స్థానిక సిహెచ్‌సిలో శనివారం హెచ్‌డిఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ అనుమతి తీసుకున్న తర్వాతే హెచ్‌డిఎస్ నిధులను ఖర్చు చేయాలని హెచ్‌డిఎస్ కమిటీ సభ్యులు సుబ్బారావు కోరారు. ఫిజియో థెరపీ వైద్యుడిని నియమించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాయాలని సూపరింటెండెంట్ జి.శశిభూషణరావును ఎమ్మెల్యే శంబంగి కోరారు. సమావేశంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 50 మంది వికలాంగ, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు బూసాయవలస గ్రామానికి చెందిన కేతిరెడ్డి తిరుపతి, సునంద దంపతులు వారి కుమారుడు యక్షిత్ పుట్టినరోజు సందర్భంగా విద్యా సామాగ్రిని హెచ్ఎం దత్తి సత్యన్నారాయణ చేతుల మీదుగా శనివారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులకు, పాఠశాలకు, దాతలు సహకరించటం అభినందించదగ్గ విషయమన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు శంకరరావు, సత్యన్నారాయణ, సంధ్య, విజయ పాల్గొన్నారు.

కాంస్య పతక విజేతకు ఎమ్మెల్యే అభినందనలు

కొత్తవలస : బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో భారతదేశం తరుపున పాల్గొని కాంస్య పతకం సాధించిన ములపర్తి ప్రకాష్ రావును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కొప్పుల వెలమ రాష్ట్ర చైర్మన్ నెక్కల నాయుడు బాబు, లక్కవరపుకోట ఎంపిపి శ్రీనివాస్ రావు, జెడ్‌పిటిసి వరలక్ష్మి, గుమ్మడి సత్యనారాయణ, కొత్తవలస ఎఫ్‌బిసి సభ్యులు గొడుగుల మహేంద్ర, పెడిరెడ్ల సూరిబాబు, శ్రీను రాజు, ఎంపిటిసి కొల్లి కృష్ణ, కంటకాపల్లి వైసిపి నాయకులు మదిన అప్పలరమణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

జగనన్న హౌసింగ్ డే ఎందుకో?

వేపాడ: మండలంలోని సోంపురంలో ఎప్పటి మాదిరిగానే శనివారం జగనన్న హౌసింగ్ డే నిర్వహించారు. వాస్తవానికి ఈ గ్రామంలో ఇంతవరకు జగనన్న కాలనీ నిర్మాణంలో భాగంగా ఇళ్ల స్థలాలే మంజూరు కాలేదు. కానీ ఇటువంటి గ్రామంలో జగనన్న హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని పలువురు చెప్పుకుంటున్నారు. ఈ గ్రామంలో సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టుకుంటున్న వారికి కూడా సకాలంలో బిల్లులు మంజూరు చేయలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సమావేశాలు ఆపి బిల్లులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్, సర్పంచ్ మురిపిండి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత

శృంగవరపు కోట : స్థానిక గొల్లపాకలు ప్రాంత నివాసితుల వినతి మేరకు గొర్రె పెంటలు తొలగించాలని ప్రజాశక్తిలో వెలువడిన వార్తకు స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారి జుత్తాడ హారిక తమ సిబ్బందిని గొల్లపాకలు ప్రాంతానికి పరిశీలన నిమిత్తం పంపించారు. మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ జ్యోత్స్న జమీమా, సచివాలయం ఆరోగ్య కార్యదర్శి షేక్ నూర్జహాన్, ఆశా వర్కర్లు ఈ తనిఖీ బృందంలో ఉన్నారు. వీరి నివేదిక ఆధారంగా స్పందించిన పంచాయితీ కార్యనిర్వహణాధికారి కన్న బాబు పారిశుధ్య సిబ్బంది చేత కాలువల పూడికలను తొలగించారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత

బొబ్బిలి: వైసిపితోనే రైతులకు న్యాయం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. గొల్లపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం పంట నమోదు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎరువులు, విత్తనాలు రైతులు వద్దకు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. పంట నమోదుతో రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఇద్దరు

భోగాపురం: మండలంలోని రామచంద్రపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవలి కొత్తవలసలో జరిగిన అండర్-14 వాలీబాల్ క్రీడలో నెల్లిమర్ల నియోజకవర్గం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందులో 9వతరగతి చదువుతున్న బాకి రమ్య, బాకి గౌరి ఇద్దరూ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రదానోపాధ్యాయులు వై విజయలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కె. రమణ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో శాంతియుతంగా ఉండాలి

తెర్లాం: గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా ఉండాలని బొబ్బిలి డిఎస్‌పి శ్రీధర్ అన్నారు. మండలంలో సుందరాడలో నమోదైన అట్రాసిటీ, ఫోక్స్ కేసుపై ఆయన శనివారం విచారణ చేపట్టారు. ఇరు వర్గాలతో మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకూడదన్నారు. అంతకు ముందు స్థానిక ఎస్ఐ ఆర్.రమేష్ కేసులు పై ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

యువ ఇంజినీర్ సాగర్ ఉదారత

నెల్లిమర్ల: మండంలోని అలుగోలు గ్రామానికి చెందిన మరువాడ శ్రీను పక్ష వాతంతో బాధ పడుతున్న విషయాన్ని తెలుసుకుని ఆదే గ్రామానికి చెందిన యువ ఇంజనీరు కురిమినేని సాగర్ నాయుడు ఉదారత చాటుకున్నాడు. లండన్‌లో ఉద్యోగం చేస్తున్న సాగర్ నాయుడు శనివారం రూ. 10వేలు సహాయం బాధితునికి పంపిణీ చేశారు. ఈ నగదును మాజీ ఎంపిటిసి కురిమినేని దివాకర్ బాధితుడి ఇంటికి వెళ్ళి పరామర్శించి ఆయనకు అందించారు. ఈ కార్యక్రమంలో అలుగోలు టిడిపి ప్రెసిడెంట్ ఆల్తి బాబురావు, మత్స బోజి చక్రపాణి,అడవి రాము, గుణ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి అధికారులతో సమావేశం

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంతవరకు చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డాక్టర్ సూచించిన రిఫరెన్స్ కేసులను తొందరగా పరిష్కరించాలన్నారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి చేత డౌన్లోడ్ చేయించాలని సిబ్బందికి సూచించారు. ఆడుకుందాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆటస్థలాలను సిద్ధం చేయలేని ఎంఇఒకు తెలిపారు. మారిక గిరిజన గ్రామంలో పాఠశాలకు అనువైన స్థలాన్ని గుర్తించాలని తహశీల్దార్‌కు సూచించారు.

పాఠశాల పరిశీలన

వేపాడ : మండలంలోని ఆకుల సీతంపేట ప్రాథమిక పాఠశలను ఎంఇఒ పి. బాలభాస్కరరావు శనివారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థుల వర్క్ బుక్స్ , హోమ్ వర్క్, లెర్న్ ఏ డే ఏ వర్డ్, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

వైసిపికి గుణపాఠం తప్పదు : టిడిపి

ప్రజాశక్తి- గరివిడి

రానున్న ఎన్నికల్లో టిడిపిదే విజయమని టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. తప్పు చేయకపోయినా కేవలం వ్యక్తిగత కక్షతోనే చంద్రబాబును అరెస్టు చేసి, అక్రమంగా 50 రోజులుగా జైల్లో పెట్టారని విమర్శించారు. శనివారం చీపురుపల్లిలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక్క రూపాయి కూడా అవినీతి చేయలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైల బలరాం, రౌతు కామునాయుడు, తిరుమలరాజు కిరణ్ కుమార్ రాజు, తాడ్డి సన్యాసి నాయుడు, సారేపాక సురేష్ బాబు, రెడ్డి గోవింద, యజ్జి పరపు సత్యం, ముల్లు రమణ, పెందుర్తి సింహాచలం, మహంతి అప్పలనాయుడు, మండల చంటి, పిళ్ళా అప్పలనాయుడు, శనపతి శ్రీనివాసరావు, అరతి సాహు, సబ్బి సోనియా తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : టిడిపి బాబు షూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం కల్పించి ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు, నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు సూచించారు. శనివారం నియోజక వర్గం కేంద్రంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం, భవిష్యత్ గ్యారంటీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాబుతో భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నవంబరు 1 నుంచి పుర్ణ ప్రారంభం చేస్తామని దీనిపై గ్రామాల్లో ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర రావు, సువ్వాడ రవి శేఖర్, ఎల్.ఎల్ నాయుడు, పతివాడ తమ్మినాయుడు, ఆకిరి ప్రసాద్‌రావు, నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, మహంతి శంకర్రావు, పల్లె భాస్కర్‌రావు, కర్రోతు సత్యనారాయణ, గేదెల రాజారావు, పోతల రాజప్పన్న, అవనాపు సత్యనారాయణ, పాల్గొన్నారు. **బాడంగి:** చంద్రబాబు ఆరోగ్యంగా ఉండటంతో పాటు త్వరలో బయటకు రావాలని టిడిపి బొబ్బిలి నియోజకవర్గం ఇంచార్జ్ బేబీ నాయన అన్నారు. మండల కేంద్రంలో శనివారం నల్ల కండువాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం టిడిపి మద్దతుదారు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు మండల సర్వ సభ్య సమావేశాన్ని తిరస్కరించారు. జై చంద్రబాబు అనే నినాదాలతో ఎంపిడిఒ కార్యాలయం నుంచి టిడిపి బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించిరు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుకు నిరసనగ రాష్ట్రంలో టిడిపికి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేకనే వైసిపి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, ఎంపిటిసిలు పాలవలస గౌరు, సింగిరెడ్డి భాస్కర్ రావు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. **బొండపల్లి** : 2024 ఎన్నికలలో వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కెఎ నాయుడు అన్నారు. మండలంలోని గరుడబిల్లి జంక్షన్‌లో ఉన్న ఎస్ఎస్ఎన్ ఫంక్షన్ హాల్లో శనివారం నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కెఎ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేక కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండారు బాలాజీ, పివివి గోపాలరాజు, కోరాడ కృష్ణ, అట్టాడ లక్ష్మునాయుడు, కొండపల్లి భాస్కర్ నాయుడు, పెద్దింటి మోహన్, పోలిపర్తి స్వామి నాయుడు, గంట్యాడ శ్రీదేవి, వేమలి చైతన్య బాబు, అల్లు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. **కొత్తవలస:** స్థానిక టిడిపి మండల పార్టీ కార్యాలయంలో శనివారం టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు చౌదరి నారాయణ మూర్తి పాల్గొని మాట్లాడారు. సమావేశానికి ముందు కొత్తవలస పార్టీ కార్యాలయం నుంచి దేవితల్లి గుడి వరకు చంద్ర బాబునాయుడు అరెస్టును ఖండిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, ఎస్.కోట, ఎల్‌కోట టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్. నాయుడు, చొక్కాకుల మల్లునాయుడు, నాయకులు కోళ్ల శ్రీను, కరెడ్ల ఈశ్వరరావు, బండారు పెదబాబు, దాసరి లక్ష్మి, కొల్లి రమణ మూర్తి, రెడ్డి వెంకన్న, కొట్యాడ రమణ మూర్తి, కనకాల శివ తదితరులు పొల్గొన్నారు. **విజయనగరం కోట :** నవంబరు ఒకటో తేది నుంచి బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు తెలిపారు. శనివారం స్థానిక అశోక్ బంగ్లాలో టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి పార్టీ పరిశీలకులు ఆర్‌పి భంజ్‌దేవ్ హాజరయ్యారు. సమావేశంలో అశోక్ మాట్లాడుతూ 45 రోజుల పాటు 'బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్ర మంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు.



నెల్లిమర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు

జెఎఎస్‌తో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- రేగిడి

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. శనివారం తునివాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్షతో ప్రజల ఆరోగ్యానికి రక్షణగా ఉంటుందన్నారు. అనంతరం 576 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు, వైద్యాధికారి అసిరి నాయుడు, కరణం గోవిందరావు, కరణం శ్రీనివాసరావు, నెల్లి పెంటంనాయుడు, కెల్ల మన్మధరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పేదల ఆరోగ్య పరిరక్షణకై జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని మూలబొడ్డవర గ్రామ సచివాలయ పరిధి మూలబొడ్డవర గ్రామంలో శనివారం ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేసిన పథకమే జగనన్న సురక్ష అని అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, స్థానిక సర్పంచ్ దేవపురపు మీనా, ఎంపిటిసి లక్ష్మి, వైస్ సర్పంచ్ అప్పారావు, పెదఖండేపల్లి సర్పంచ్ యాళ్ళ రమణ, ఎంపిటిసి బోదల దేముడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: అందరికి ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ కె. రాధిక అన్నారు. శనివారం మండలంలోని చింతపల్లి సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 356 మందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైయస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా కంటి పరీక్షలు చేసి వారికి ఉచితంగా కళ్ళద్దాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల జేసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, మత్స్యకార సంఘం అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న, సర్పంచ్ బర్రి ముసలి, తహశీల్దార్ బాస్కరావు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, నాయకులు దాసు, అప్పడు దొర, డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక పిహెచ్‌సి పరిధిలోని డాబాలు కొత్తవలస–4 సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో శనివారం 440 మందికి తనిఖీలు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ డి.సీతల్ వర్మ తెలిపారు. సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పంచాయతీ సెక్రటరీ ఇ. కన్నబాబు తెలిపారు. ఎంపిపి నీలం శెట్టి గోపమ్మ మాట్లాడుతూ జగనన్న సురక్షను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



రేగిడి: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

ఆలయం మూసివేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానాన్ని గ్రహణం కారణంగా శనివారం రాత్రి మూసివేశారు. రాత్రి ఒంటి గంటకు చంద్ర గ్రహణం పడుతున్న నేపథ్యంలో రాత్రి ఆరాధన పూర్తి చేసుకుని స్వామి వారికి పవళింపు సేవ నిర్వహించి సాయంత్రం 5 గంటలకు దేవాలయం తలుపులు అర్చకులు మూసివేశారు. అనంతరం ఆదివారం ఉదయం సంప్రోక్షణ నిర్వహించి భాల బోగం తరువాత దర్శనానికి అనుమతిస్తున్నట్లు ప్రధానార్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులు తెలిపారు.

చీరలు పంపిణీ

శృంగవరపుకోట: పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా దుర్గాదేవి ఆలయం ఆవరణలో వందలాది మంది మహిళలు, భక్తులకు కమిటీ సభ్యులు శనివారం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ఫోక్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, దుర్గాదేవి కమిటీకి చెందిన కేవీఎస్ రామరాజు, మళ్ల రామకృష్ణ, పెనగంటి గంగరాజు, జె.ఉమ, వాకాడ చినబాబు, సూరిబాబు, శేఖర్, పి.వేణు, శంకర్ విలాస్ బుజ్జి పాల్గొన్నారు.

పేదలందరికీ పథకాలు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

పేదలందరికి ప్రభుత్వ పథకాలు అందివ్వడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే యెస్.వి.సి.హెచ్ అప్పలనాయుడు అన్నారు. శనివారం కోమటిపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను లబ్ధిదారులకు అందుతున్నయా లేదా అని ఆరా తీశారు. అనంతరం జిల్లా పరిషత్తు పాఠశాలకు వంట పాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సంబంగి లక్ష్మి, ఎమ్మెల్యే సోదరులు వేణుగోపాల్ నాయుడు, ఎంపిడిఒ రవి కుమార్ జెడ్‌పిటిసి శాంత కుమారి, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు వంగపండు శ్రీరాములు నాయుడు, గొట్టాపు సూర్యనారాయణ, గొట్టాపు అప్పారావు, వెలమల సింహాచలం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో లోపాలుంటే సవరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఓటర్ల జాబితాలో లోపాలుంటే సవరించి సరిచేయాలని తహశీల్దార్ డి. ధర్మ రాజు సూచించారు. శనివారం స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, నమోదు, తొలగింపులో తెడాలుంటే బిఎల్ఒలు పరిశీలించి సవరించాలని సూచించారు. ప్రతీ పోలింగు కేంద్రం పరిధిలో బిఎల్ఒలు ఓటర్ల జాబితా పరిశీలించి ఓట్ల నమోదు, తొలగింపులో గుర్తించి సరిచేయాలని కోరారు. ఓటర్ల జాబితాలో డిసెంబర్ 9లోగా ఓటర్లు మార్పులు, చేర్పులు, తొలగింపులు జరిపించాలని 18 సంవత్సరాలు నిండిన వారికి కొత్తగా ఓటు నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటి తహశీల్దారు డి.శైలజ, ఆర్ఐ దేవి పాల్గొన్నారు.

రామభద్రపురం: ఓటు హక్కు, నమోదు, సవరణలు పారదర్శకంగా జరిగేలా బూత్ స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ సులోచనారాణి ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం బూత్ స్థాయి అధికారులతో ఓటర్ల జాబితా పబ్లికేషన్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సక్రమంగా, వివాద రహితంగా అన్ని రాజకీయ పార్టీల సమన్వయంతో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈనెల 27 నుంచి వచ్చే నెల 9వరకు ఓటర్ల జాబితాపై ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారాలు జరిగేలా చూడాలని నవంబర్ 4 నుంచి ఓట్లు నమోదు, అనర్హుల తొలగింపులు చేయాలని డిసెంబరు 26 లోపు అంతవరకు వచ్చిన అభ్యంతరాలు, పరిష్కారాల పై నివేదిక సమర్పించి తుది ఓటర్ల జాబితా వచ్చే ఏడాది జనవరి 5న ప్రదర్శన జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై దర్యాప్తు

ప్రజాశక్తి- బొబ్బిలి

మల్లమ్మపేటలో ప్రభుత్వ స్థలం ఆక్రమణపై దర్యాప్తు చేస్తున్నట్లు తహశీల్దార్ డోల రాజేశ్వరరావు చెప్పారు. మల్లమ్మపేటలో మరుగుదొడ్ల స్థలాన్ని ఆక్రమించేసి ఇళ్లను నిర్మిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపణలు చేయడంతో ఆర్.ఐ కళ్యాణ్ చక్రవర్తి, విఆర్వోతో దర్యాప్తు చేపిస్తున్నామని చెప్పారు. దర్యాప్తులో ప్రభుత్వ స్థలంగా గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మల్లమ్మపేటలో ఆర్.ఐ, విఆర్వో దర్యాప్తు చేశారు.

వంట పాత్రలు పంపిణీ

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి మండలంలోని ఉన్న 64 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు శనివారం ఎంపిపి వెంకట నరసమ్మ చేతులు మీదుగా జగనన్న గోరు ముద్ద వంట పాత్రలను పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, రేవళ్ళ సత్తిబాబు, పాండ్రంకి వాసు, గాజుల శ్రీను, బొంతు తిరుపతి, ప్రభాత్ కుమార్, ఎంఇఒ యమ్. బూసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆక్సైడ్ ప్లాంట్ కార్మికుల ఆందోళన బాట

- వాహనాలను అడ్డుకునేందుకు యత్నం
- పోలీసుల చొరవతో చర్చలకు శ్రీకారం

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక డిఎఫ్ఎన్‌లోని రాధిక మెటల్ అండ్ మినరల్స్ సంస్థకు చెందిన ఆక్సైడ్ ప్లాంట్ మూసివేత నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, సిఐటియు గరివిడి డివిజన్ కార్యదర్శి అంబళ్ల గౌరి నాయుడు ఆధ్వర్యంలో శనివారం కార్మికులు ఆందోళన బాట పట్టారు. కొద్ది రోజులుగా ఆక్సైడ్ ప్లాంట్ పనులు నిలిపివేసి, ఇక్కడి కార్మికులకు పని దినాలను తగ్గిస్తూ రావడమే కాకుండా వేతనాలు పెంచాలని కోరడంతో, పూర్తిగా కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. గత 20 రోజులుగా పరిశ్రమ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టిన కార్మికులు శనివారం సంస్థకు చెందిన లారీలు ఇతర వాహనాలను అడ్డుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. స్థానిక ఎస్ఐ దామోదర్ కార్మికులు, యాజమాన్య ప్రతినిధులతోనూ మాట్లాడి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కార్మికులకు సూచించడంతో వాహనాలను విడిచి పెట్టారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకూ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని అంబల్ల గౌరీ నాయుడు తెలిపారు.



కార్మిక నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ దామోదర్

మండల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి- బాడంగి

ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి సూర్య చంద్రరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి భోగి గౌరీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోగల ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. మండల అభివృద్ధికి సంబం ధించిన 21 అంశాలపై ప్రభుత్వ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు అడిగిన పలు సమస్యలు అధికారులు పరిష్కరించాలని కోరారు. గ్రామాలను అభివృద్ధి చేయడంలో గ్రామ స్థాయి నాయకులు ప్రభుత్వ అధికారులతో కలిసి పనిచేయా లన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఆంజినేయులు, ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి సలహాదారు తెంటు మధుసూధన్, వైస్ ఎంపిపి రమేష్, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం ముట్టడి

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న గ్రీన్ అంబాసిడర్లు సిఐటియు ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ముట్టడించారు. గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించలేని సమావేశాలెందుకని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు సురేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు ఆరు మాసాలుగా గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వలేదన్నారు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. వెంటనే జీతాలను చెల్లించకపోతే సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి వీలు లేదంటూ ఎంపిడిఒ కార్యాలయ గేటువద్దకు చేరుకున్నారు. దీంతో సభ మధ్య నుంచి ఎంపిడిఒ గ్రీన్ అంబాసిడర్ల వద్దకు చేరుకొని సమస్యను పరిష్కరించే దిశగా మాట్లాడారు. 15 రోజుల్లో గ్రీన్ అంబాసిడర్ల మొత్తం జీతాలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఇఒపిఆర్‌డికి జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి సలహాదారు తెంటు మధుసూధన్ సూచించారు. దీంతో గ్రీన్ అంబాసిడర్లు నిరసనను తాత్కాలికంగా నిలిపివేశారు. 15 రోజులలో జీతాలు చెల్లించకపోతే మండల పరిషత్ కార్యాలయానికి తాళం వేసి భైఠాయిస్తామని హెచ్చరించారు.



ఎంపిడిఒకు వినతినిస్తున్న గ్రీన్అంబాసిడర్లు

యువతి ఆత్మహత్య

రామభద్రపురం: ప్రేమించిన వ్యక్తి పెళ్లిని వాయిదా వేస్తున్నాడనే కారణంతో జీవితంపై విరక్తి చెంది పాతరేగ గ్రామానికి చెందిన సబ్బవరపు పెంటమ్మ(19) ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. పెంటమ్మ అదే గ్రామానికి చెందిన వ్యక్తితో ప్రేమలో పడి పెళ్లి చేసుకుంటాడని నమ్మింది. ఆ యువకుడు పెళ్లి ప్రసక్తి వచ్చే సరికి దాట వేస్తూ వాయిదాలు వేయడంతో పెంటమ్మ ఆవేదనకు గురైంది. ఇదే క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాడంగి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం సాయంత్రం మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు.

గురుకులంలో కెపిఐ ఆడిట్

వేపాడ: స్థానిక గురుకుల పాఠశాలలో శనివారం కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ (కెపిఐ) ఆడిట్‌ను డిసిఒ పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలలో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చెప్పే టీచర్స్ రికార్డులు, టీచింగ్ డైరీలు పరిశీలించారు. కమిటీ సభ్యులు ఇంటర్, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రాధాన్యత గల ప్రశ్నలపై సాధన చేయాలన్నారు. 2 మార్క్స్, డయాగ్రాము, మాప్ పాయింటింగ్ పై ఎలా చెయ్యాలి అనే విషయాలను వివరించారు. రీడింగ్, రైటింగ్ స్కిల్స్ అందరికీ రావాలి అని తెలిపారు. టీచర్స్‌తో మీటింగ్ ఏర్పాటు చేసి ఇంటర్మీడియట్, టెన్త్ స్టూడెంట్స్‌కి పరీక్షలో 100శాతం ఎలా సాధించాలో మెలుకువలను చెప్పారు. చదువులో వెనకబడిన విద్యార్థులందరికీ సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.

మద్యం బాటిళ్లతో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి- బొబ్బిలి

బాడంగి మండలంలోని పినపెంకి గ్రామానికి చెందిన బొనకల సత్యంను 9 మద్యం సీసాలతో పట్టుకున్నామని ఎస్ఇబి సిఐ జై భీమ్ శనివారం తెలిపారు. ఆయన పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా అక్రమంగా మద్యం సీసాలు, నాటుసారా లు విక్రయిస్తే 9440902372 కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ దాడుల్లో సెబ్, ఎస్ఐ చిన్నం నాయుడు, సిబ్బంది చంద్ర ప్రసాద్, ఆదినారాయణ, కళ్యాణిలు పాల్గొన్నారు.